క్లుప్తంగా

క్రికెట్ కిట్ల బహూకరణ



కరప హైస్కూలులో క్రికెట్ జట్లకు క్రీడా సామగ్రి అందజేస్తున్న మాజీ సర్పంచ్ తాతీలు, సత్తిబాబు

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు సమకూర్చిన విరాళాలతో గ్రామంలోని మూడు వీధుల క్రికెట్ జట్లకు క్రీడా సామాగ్రిని మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, వైఎస్సార్ సీపీ నాయకుడు నక్కా సత్తిబాబు అందజేశారు. మెరకవీధి జట్టుకు, పేపకాయలపాలెం జట్లకు రూ.15 వేలు చొప్పున, కరప ఫ్రెండ్స్ జట్టుకు రూ.7 విలువైన క్రికెట్ కిట్లను అందజేశారు. దేవు శివ, పేకేటి దుర్గాప్రసాద్, పోలిశెట్టి వెంకట రమణారావు, పేపకాయల తణుకులరాజు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కరప: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన కథనం మేరకు మండలం గొర్రిపూడి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ మేడిశెట్టి మణికంఠ (27) డిశంబరు 31వ తేదీ రాత్రి కేక్ తీసుకు వచ్చేందుకు గొర్రిపూడి సెంటర్‌కు మోటార్ సైకిల్‌పై వెళ్లాడు. తిరిగి వస్తుండగా పీటీ పుంత వద్ద అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి పడిపోయాడు. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలు కాగా చికిత్స కోసం అతనిని జీజీహెచ్‌కు తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మణికంఠకు భార్య, ఒక కుమార్తె ఉన్నారు. భార్య శ్రావణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ టి.సునీత కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 141 మంది ఎంపిక

బాలాజీచెరువు: బెంగళూరుకు చెందిన ప్రముఖ ఎంఎన్‌సీ సంస్థ యాక్సెంచర్ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 141 మంది ఎంపిక య్యారని ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాల అకడమిక్ డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడు మంగళవారం తెలిపారు. డిగ్రీ విద్యార్హతతో ఎంపికైన వారికి ప్రారంభ దశలో ఏడాదికి రూ.3.5 లక్షల వేతనాన్ని సంస్థ చెల్లిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్, కార్యదర్శి నల్లమిల్లి సుగుణారెడ్డి, ప్రిన్సిపాల్ కరుణ, బ్యులా, టీపీఓ వీఎస్ఎస్ కుమార్, కిశోర్ పాల్గొన్నారు.

10న డిప్యూటీ సీఎం పర్యటన



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: ఈ నెల పదో తేదీన ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కళ్యాణ్ జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ షణ్మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో పర్యటన ఏర్పాట్లపై సమీక్షించారు. పదో తేదీన పిఠాపురం నియోజకవర్గంలో ఆయన పర్యటించి కుమారపురంలో మినీ గోకులాన్ని ప్రారంభిస్తారని, మున్సిపల్ హైస్కూల్ హైస్కూల్‌లో స్టాల్స్‌ను పరిశీలించి, రథాలపేట లబ్ధిదారులకు పట్టాల పంపిణీ చేస్తారన్నారు. అనంతరం సభా కార్యక్రమం ఉంటుందన్నారు. సమావేశంలో జేసీ రాహుల్ మీనా, డీఆర్వో జె వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

పిఠాపురం: రాష్ట్రస్థాయి ఎన్‌పీఎం షాప్ యజమానుల శిక్షణలో భాగంగా ఐదో రోజు మండలం దొంతమూరులో ప్రకృతి వ్యవసాయంపై రైతు పాటి శ్రీను వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం శిక్షణ ఇచ్చారు. 20 సెంట్ల భూమిలో ఏటీఎం మోడల్‌లో 22రకాలు ఆకు కూరలు, కాయకూరలు, తీగజాతి వేయంచి 4 టన్నుల ఘన జీవామృతం, బయోచారు తయారు చేసే విధానంపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్టేట్ తిమటిక్ లీడ్ జానకి, బుజ్జిబాబు, జిల్లా కోఆర్డినేటర్ గణేష్, రిసోర్స్ పర్సన్ శివచక్రం ఎన్ఎఫ్ఏలు పాల్గొన్నారు.

కాలు దువ్వుతున్న కోళ్లు



కోడి పందాలకు సిద్ధమవుతున్న బరులు

కొత్తపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో కోడిపందేలకు బరులు సిద్ధమవుతున్నాయి. పోలీసుల ఆంక్షలు ఎలా ఉన్నా ఎవరి పని వారిదన్నట్టు నిర్వాహకులు కోళ్లను పందేలకు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే పందాలకు సంబంధించి కత్తులు కట్టే వారిని ముందస్తుగా బైండోవర్ చేసి హెచ్చరిస్తున్నారు. ప్రతి సంక్రాంతి ముందు ఈ హెచ్చరికలు మామూలేనని మండలంలో కొన్ని గ్రామాల్లో బహిరంగంగా, మరికొన్ని గ్రామాల్లో లోపాయికారీగా పందేలకు ఏర్పాటు చేస్తున్నారు. పలు కొబ్బరి తోటలు, లే అవుట్లు పందేలు ఆడేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పందెం కోళ్లను సిద్ధం చేస్తున్నారు.

ప్రాణదాతలకు ప్రోత్సాహకం

- జీరో అవర్‌లో సమాచారమిస్తే రూ.5 వేల నగదు, జ్ఞాపిక
- గుడ్ సమరిటన్ పేరుతో సత్కారం
- వైద్య, ఆరోగ్య, ఆర్అండ్‌బీ రవాణా శాఖల అవగాహన

బాలాజీచెరువు : రోడ్డు ప్రమాదాల నివారణకు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా నిత్యం కనీసం ఇద్దరు ముగ్గురు ప్రాణాలు కోల్పోవడం, లేదా తీవ్ర గాయాలపాలవడం సంభవిస్తూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆయా కుటుంబాలు రోడ్డున పడడం, ఆ ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపై పడడం జరుగుతోంది. మరణాలకు కారణాల్లో ఎక్కువ శాతం జీరో అవర్‌లో వైద్యసేవలు అందకపోవడమేనని కేంద్ర ప్రభుత్వం గుర్తించి వాటిని అరికట్టేందుకు ప్రాణదాతలకు ప్రోత్సాహకాలను ప్రకటించింది. ప్రమాదం జరిగినప్పుడు వెంటనే స్పందించి కాపాడే వారిని సత్కరించి జ్ఞాపికతో పాటు రూ.5 వేల నగదు ఇవ్వనున్నారు. దేశ వ్యాప్తంగా గుడ్ సమరిటన్ అనే కార్యక్రమం పేరుతో దీన్ని ప్రారంభించగా దీనిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా భాగస్వామ్యం తీసుకుని పలు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. వైద్యశాలలు, ముఖ్యకూడళ్లు, జాతీయ రహదారుల వంటి ప్రాంతాల్లో డాక్టర్లు, ఎంవీఐలు కరపత్రాలు పంపిణీతో పాటు వాల్‌పోస్టర్లు ఏర్పాటు చేస్తున్నారు.



ప్రచార వాల్‌పోస్టర్‌ను అతికిస్తున్న రవాణా శాఖాధికారులు

చాలా మంది ప్రమాదాలు జరిగినప్పుడు 104, 108 వంటి అత్యవసర సర్వీసులకు సమాచారం ఇవ్వాలని ఆలోచన వచ్చినా పోలీసులు, వివరాలు వంటి తలనొప్పి ఎందుకని వెళ్లిపోతుంటారు. ఇటువంటి వాటికి చెక్ పెట్టడానికి సమాచారం ఇచ్చిన వారికి పోలీసులతో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులకు జీరో అవర్‌లో సేవలు అందించిన వారికి కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వశాఖ రూ.5 వేల నగదు ప్రోత్సాహకం ఇవ్వాలని నిర్ణయించింది. ఎక్కువ మంది ప్రాణాలు కాపాడిన వారిని జాతీయ స్థాయిలో పురస్కారం అందజేసే ఆలోచనలో కేంద్ర ప్రభుత్వం ఉన్నది. ఈ కార్యక్రమం నిమిత్తం జిల్లాకు కొంత నగదు ముందుగానే ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తుంది.

నిబంధనలు మార్పు చేశారు



రోడ్డు ప్రమాదంలో సహాయం చేసిన వారి వివరాలు తప్పని సరిగా ఇవ్వాలనే నిబంధనను మార్చారు. వారికి ఇష్టమైయితేనే వివరాలు ఇవ్వవచ్చు. రోడ్డు ప్రమాదాల మరణాలను కేంద్ర ప్రభుత్వం కట్టడి చేస్తుంది. ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన గుడ్ సమరిటన్ కార్యక్రమంపై ప్రజల్లో చైతన్యం పెంపొందిస్తాం. జాతీయ రహదారి అధికంగా ఉన్న ప్రాంతం నేపథ్యంలో ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పోలీస్, వైద్య సమన్వయంతో కార్యక్రమంపై మరింత చైతన్యవంతం చేస్తాం.

– కె.శ్రీధర్, జిల్లా రవాణాశాఖ అధికారి

ప్రజలు అవగాహన కల్పించుకోవాలి



ప్రమాదం సమాచారం ఇస్తే ఎక్కడ తన తలకి చుట్టుకుంటుందోనని వారి దారిన వారు వెళ్లిపోతుంటారు కొందరు. గుడ్ సమరిటన్ పేరుతో నిబంధనలు మార్చడం ద్వారా కాస్త ఉపశమనం కలుగుతంది. ఈ విధానంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించుకోవాలి. మనిషికి సహాయం చేయడం వల్ల సమాజానికి సేవ చేసినవాళ్లం అవుతాము.

– డాక్టర్ కె.బాల్జీ, న్యూరో సర్జన్

ఏఐలో పట్టు సాధించాలి



సదస్సుకు హాజరైన సాంకేతిక నిపుణులు

బాలాజీచెరువు: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌పై పట్టు సాధించి సరికొత్త ఆవిష్కరణలు చేపట్టాలని ప్రముఖ శాస్త్ర, సాంకేతిక నిపుణులు అశ్విన్ కుమార్ పేర్కొన్నారు. ఐడియల్ ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ, ఈసీఈ విద్యార్థులు, అధ్యాపకులకు వారం రోజుల పాటు నిర్వహించే వర్క్‌షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా అశ్వినికుమార్ మాట్లాడుతూ సమాజానికి, రైతులకు ఇతర రంగాలకు ఉపయోగపడేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ప్రాజెక్టులు రూపొందించాలని, సమాజానికి ఉపయోగపడే వాటిని కనిపెట్టాలని సూచించారు. ఇటువంటి సదస్సులో పాల్గొనడం ద్వారా విద్యార్థుల మధ్య ఆలోచనలు పంచుకోవడానికి అస్కారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ జీవీ కృష్ణంరాజు, ప్రిన్సిపాల్ టి.శ్రీకాంత్, సీఎస్ఈ హెచ్ఓడీ ఎంఎస్ఆర్ ప్రసాద్, రాజేష్ బాబు, టీపీవో ఏ.రమేష్ పాల్గొన్నారు.

తూరంగి పీహెచ్‌సీ తనిఖీ



పీహెచ్‌సీ తనిఖీకి వచ్చిన డీఎంహెచ్‌వో నరసింహనాయక్ తదితరులు

కాకినాడ సిటీ: తూరంగి పీహెచ్‌సీని జిల్లా వైద్యాధికారి డాక్టర్ జె.నరసింహనాయక్, పడాల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం మంగళవారం తనిఖీ చేసింది. ఈ సందర్భంగా పీహెచ్‌సీ ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాలకు సేఫ్ టచ్, అన్‌సేఫ్ టచ్‌పై అవగాహన కల్పించారు. 100 శాతం చిన్నారులు సేఫ్ ప్రోగ్రాంలో భాగంగా 18 ఏళ్ల లోపు ఆడ, మగ పిల్లలకు సేఫ్ టచ్, అన్‌సేఫ్ టచ్‌లపై స్కిట్స్, ఎల్ఈడీ ప్రాజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. రేపటి భవిష్యత్‌కు పిల్లలే పౌరులు కాబట్టి వారిని కాపాడుకోవల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరికి ఈ అంశంపై అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో నరసింహనాయక్ ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాలను ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని తూరంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కాకినాడ పట్టణ ఎన్‌టీఆర్ నార్త్‌వింగ్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని బృందం తనిఖీ చేసింది. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు వసుంధరాదేవి, ఎంఎం ప్రత్యూష, డీఎస్‌వో గిరి గణేష్, ఎంపీహెచ్ఈవో పీవీ ప్రకాశరావు, హెచ్‌వీ మరియమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కులగణన అభ్యంతరాల స్వీకరణకు గడువు పెంపు

కాకినాడ సిటీ: ఎస్సీ జనాభాపై సోషల్ ఆడిట్‌పై అభ్యంతరాల స్వీకరణను 16వ తేదీ వరకు పొడిగించినట్టు జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. సమగ్ర వివరాల సేకరణ అనంతరం ఈనెల 20న కులగణన తుది వివరాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శిస్తామన్నారు. పేరు, ఆధార్ నంబర్, పుట్టిన తేదీ, వయస్సు, ఉపకులం, మరుగుదొడ్డి సౌకర్యం, తాగునీటి సౌకర్యం, విద్యార్హత, వృత్తి, వ్యవసాయం వివరాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శించడం జరుగుతుందన్నారు. అభ్యంతరాలను వీఆర్వో పరిశీలించి వివరాలను ఆర్ఐకి నివేదిస్తారని, వీటిని ఆర్ఐ పునఃపరిశీలించి తహసీల్దార్‌కు సిఫారసు చేస్తారన్నారు. అనంతరం తుది ఆమోదం తెలిపి వివరాల్ని పోర్టల్‌లో పొందుపరుస్తామన్నారు. ఆ వివరాల్లో కచ్చితత్వాన్ని పెంపొందించేందుకు సహాయ సాంఘిక సంక్షేమ అధికారులతో 50 మంది వివరాలన్ని ర్యాండమ్‌గా తనిఖీ చేయనున్నట్లు తెలిపారు. ఈ సోషల్ ఆడిట్‌ను కలెక్టర్, ఆర్డీవోలు పర్యవేక్షిస్తారని శ్రీనివాసరావు తెలిపారు.

రూ.1.05 లక్షల మిగులు బడ్జెట్

- కరప మండల సర్వసభ్య సమావేశం
- వివిధ శాఖల ప్రగతిపై సమీక్ష

కరప: కొత్త రేషన్ కార్డుల కోసం అర్హులు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ కోరారు. వచ్చే ఐదేళ్లలో స్వర్ణ పంచాయతీ పోర్టల్ ద్వారా అన్ని కార్యకలాపాలు నిర్వహించనున్నట్టు ఈఓపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి రూ.1.05 లక్షల మిగులు బడ్జెట్‌ను సభ్యులు ఆమోదించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అధ్యతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది.

రూ.1.05 లక్షల మిగులు బడ్జెట్ ఆమోదం

బడ్జెట్ సమావేశంలో ఎంపీపీ శ్రీలక్ష్మి మాట్లాడుతూ 11,075 మంది పింఛన్‌దారులకు రూ. 4.79 కోట్లు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఉపాధిహామీ పథకంలో 66 సీసీ రోడ్లకు 34 పూర్తిచేశామని, ఎంపీడీఓ ఎం.అనుపమ సూచనల మేరకు ఏఓ జీఎల్ నరసింహం 2024–25 సవరణ బడ్జెట్, 2025–26 ఆర్థిక సంవత్సరానికి అంచనా బడ్జెట్‌ను చదివి వినిపించి, సభ్యుల ఆమోదానికి ప్రవేశ పెట్టారు. స్టాంపు డ్యూటీపై సుంకం, తలసరి గ్రాంటు, వేలాల ద్వారా, ఉపాధి పథకం తదితరాల ద్వారా వచ్చే అన్ని పద్దులు కలిపి 28,18,81,400 రూపాయల ఆదాయంగాను, అభివృద్ధి పనులు, 15 శాతం ఎస్సీల అభివృద్ధి, 6 శాతం ఎస్టీల అభివృద్ధి, 15 శాతం స్త్రీ, శిశు సంక్షేమం, 12 శాతం అత్యవసర మంచినీటి సౌకర్యం, 15 శాతం కార్యాలయ నిర్వాహణ, 10 శాతం విద్య, వైద్యం సామాజిక అభివృద్ధి, 4 శాతం మిగిలిన పద్దులు కలిపి 28,17,76,400 రూపాయలు వ్యయంగాను, రూ.1.05 లక్షలు మిగులు బడ్జెట్‌గా చూపించారు. సభ్యులు ఏకగ్రీవంగా దీనిని ఆమోదించారు. అనంతరం వివిధ శాఖల పనితీరుపై సమీక్ష జరిపారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కరప మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీలక్ష్మి

విష్ణవే సర్వ జిష్ణవే..







కాకినాడ రూరల్: ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా కాకినాడ రూరల్ సర్పవరం జంక్షన్ వద్ద దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాలలో మంగళవారం వేంకటేశ్వర స్వామి శ్రీకృష్ణునిగా భక్తులకు దర్శనమిచ్చారు.

ప్రతి రోజు స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, దశావతారాలను రోజుకు ఒకటి చొప్పున దర్శనం కల్పిస్తున్నారు.

ధన్వంతరిగా వేణుగోపాలుడు

బోట్‌క్లబ్: రజిత దశావతార అలంకార ఉత్సవాల్లో భాగంగా స్థానిక దేవాలయంవీధిలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి మంగళవారం ధన్వంతరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

లక్ష్మీ హయగ్రీవునిగా సీతారామస్వామి

స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి లక్ష్మీ హయగ్రీవ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఏడీబీ రోడ్‌లో ట్రాఫిక్ తనిఖీలు

కాకినాడ క్రైం: మంగళవారం కాకినాడ సామర్లకోట అనుసంధానం చేసే ఏడీబీ రోడ్‌లో పోలీసులు విస్తృత ట్రాఫిక్ తనిఖీలు చేపట్టారు. ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు ఈ మార్గంలో ట్రాఫిక్ తనిఖీలు చేపట్టినట్లు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. తరుచుగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్న రహదారి కాగా సామర్లకోట-కాకినాడ రోడ్డు మరమ్మతుల నేపథ్యంలో ఏడీబీ రోడ్‌లో మరింత ట్రాఫిక్ పెరిగిందని ఎస్పీ అన్నారు. నిబంధనలు అతిక్రమించిన పలువురు చోదకులపై కేసులు నమోదు చేశామన్నారు.



ట్రాఫిక్ తనిఖీలు చేపడుతున్న పోలీసులు

మంచు పరదాలు

కరప: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఉదయం 7.30 గంటల వరకు మంచు దట్టంగా కమ్మేసింది. శీత గాలులకు భయపడి ప్రజలు పొద్దెక్కిపోతున్నా వీధుల్లోకి రావడానికి సంకోచిస్తున్నారు. మంచు ఎక్కువగా కురుస్తుండడం వల్ల దారి కనబడక పొద్దెక్కిపోయినా కూడా లైట్లు వేసుకుని వాహనాలు నడపాల్సి వస్తోంది. ఉదయం 8 గంటలకు సూరీడు వస్తే కానీ వాహనాలు కనపడని పరిస్థితి నెలకొంది. పగటి ఉష్ణోగ్రతలు తగ్గుతుండడంతో చలి ఎక్కువగా ఉంటోందని వృద్ధులు అంటున్నారు. రాత్రి సమయంలో మంచు పడుతుండటంతో చలికి తట్టుకోలేకపోతున్నామని మహిళలు, వృద్ధులు వాపోతున్నారు.



కరప-రామచంద్రపురం రహదారిలో 7.30 గంటలకు మంచు మాటున లైట్లు వేసుకుని వస్తున్న వాహన చోదకుడు



కరప-కాకినాడ రోడ్డులో ఇలా దట్టంగా..



వలసపాకల సమీపంలో పంటపొలాలపై పేరుకున్న మంచు

హెచ్‌ఎంపీవీ ప్రత్యేక వార్డు

కాకినాడ క్రైం: స్థానిక జీజీహెచ్‌లో హెచ్‌ఎంపీవీ ప్రత్యేక వార్డు ఏర్పాటైంది. 22 పడకలతో ఈ వార్డును ఏర్పాటు చేశారు. జిల్లాలో హెచ్‌ఎంపీవీ జాడ లేదని అధికారులు వెల్లడించారు. అప్రమత్తత నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్ర కమిమీషనర్ జిల్లా వైద్యాధికారులతో ఆన్‌లైన్ సమావేశం నిర్వహించారు. ప్రజలను వైరస్ పట్ల అప్రమత్తం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణను సూచించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ మాట్లాడుతూ కోవిడ్ తరహాలోనే సామాజిక దూరం, శానిటైజేషన్, కరచాలనాలకు స్వస్తి, పోషకాహారం, పరిశుభ్రత వైరస్ నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు.

హెచ్‌ఎంపీవీ వైరస్‌తో అప్రమత్తం

కరప: హెచ్‌ఎంపీవీ వైరస్ పట్ల అప్రమత్తంగా ఉంటూ, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వేళంగి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎంకే సౌజన్య తెలిపారు. మంగళవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఇది కోవిడ్-19 ఫ్లూ, ఇతర శ్వాసకోస రుగ్మతలను పోలి ఉంటుందన్నారు. జ్వరం, దగ్గు, ముక్కు కారడం, గొంతునొప్పి వంటి లక్షణాలు ఉంటాయన్నారు. ఈ వైరస్ నివారణకు చేతులను సబ్బుతో కనీసం 20 సెకన్లపాటు కడుక్కోవాలని, చేతులు శుభ్రంచేసుకోకుండా నోరు, ముక్కు, కళ్లను తాకరాదన్నారు. బహిరంగ ప్రదేశాల్లోకి వెళ్లేటప్పుడు తప్పనిసరిగా మాస్క్ ధరించాలని సౌజన్య సూచించారు.

రోగ నిరోధక శక్తిని పెంచుకోవాలి

కాకినాడ రూరల్: రోగ నిరోధక శక్తి అదుపుతో వైరస్‌లు అదుపులో ఉంటాయని డాక్టరు అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఆరోగ్య సదస్సులో ఆయన మాట్లాడుతూ చైనాలో పుట్టిన కరోనా వైరస్ ఐదేళ్ల క్రితం ప్రపంచాన్ని వణికించిందని, ప్రస్తుత పరిస్థితుల్లో చలితో తిరగకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, బుద్ధరాజు సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోండి

కాకినాడ క్రైం: స్థానిక ఎంపి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను మంగళవారం కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో కలిశారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణకు మరింత కృషి చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రాత్రి గస్తీలు పెంచి మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న చోదకులపై కేసులు నమోదు చేయాలన్నారు.

ఉపకార వేతనాల పంపిణీ

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే సివిల్ విభాగంలో బీటెక్ విద్యార్థులు 51 మందికి కాకినాడ ఇంజినీరింగ్ అలూమ్నీ ట్రస్ట్, లక్ష్మీ ఫౌండేషన్లు కలిపి మంగళవారం ఉపకార వేతనాలు అందజేశారు. ముఖ్య అతిథులుగా ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ, సివిల్ విభాగాధిపతి కోటేశ్వరరావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మోహనరావు హాజరై వారికి అందజేసారు. విద్యార్థికి రూ.20 వేల చొప్పున 21 మందికి లక్ష్మీ ఫౌండేషన్, అలూమ్నీ ట్రస్ట్ ద్వారా 30 మందికి రూ.20 వేల చొప్పున సమకూర్చగా వీటిని విద్యార్థులకు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో ట్రస్టీలు కె.రమేష్, ఎం.సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

జీడీసీఎల్ ఎస్‌డీసీగా కుమార్

కాకినాడ సిటీ: ఏపీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ కాకినాడకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా టీవీఎస్‌జీ కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు పనిచేస్తున్న మల్రిపూడి శ్రీనివాసరావును అసిస్టెంట్ సెక్రటరీ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, విజయవాడకు బదిలీ చేశారు.

285 మందికి దేహదారుఢ్య పరీక్షలు



పరుగు పోటీలో అభ్యర్థులు

కాకినాడ క్రైం: కానిస్టేబుళ్ల ఎంపికకు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహిస్తున్న దేహదారుఢ్య పరీక్షలకు మంగళవారం 285 మంది హాజరయ్యారు. ఏడో రోజు నిర్వహించిన ఈ పరీక్షల్లో 233 మంది తదుపరి పరీక్షలకు అర్హత సాధించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ పర్యవేక్షణలో ఈ పరీక్షలు జరిగాయి.